అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 05 ఫిబ్రవరి 2023

అందరి సహకారంతో మండలాభివృద్ధి



తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల నూతన ఎమ్మార్వోగా పదవి బాధ్యతలు చేపట్టిన ప్రేమ్ కుమార్ ను శనివారం మండల పీఆర్‌టీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. క్యాలెండర్, డైరీని అందజేశారు. ఎమ్మార్వో ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు మండల అధ్యక్షుడు శ్రీనివాస చారి, కార్యదర్శి గిరిధర్, రాష్ట్ర బాధ్యులు బాపురెడ్డి,మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సభ్యుల సమ్మేళనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫిబ్రవరి 4,5 తేదీలలో గుంటూరు జిల్లాలో రోటరీ జిల్లా 3150 గవర్నర్ రాజశేఖర్‌రెడ్డి తల్లా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభ్యుల వార్షిక సమ్మేళనంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్షులు సతీష్ షాహ, పీడీజీ గౌతమ్, పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ వి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ నిజామాబాద్ కార్యవర్గం నిర్వహించిన కార్యక్రమాల పత్రికాను రోటరీ అంతర్జాతీయ సంస్థ మాజీ అధ్యక్షులు శేఖర్ మెహతా ఆవిష్కరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ ఐ.డైరెక్టర్ డాక్టర్ మహేష్ కోట్బాగి, పీడీజీ హన్మంత్‌రెడ్డి, వివిధ క్లబ్‌ల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోరాటాల ఫలితం..

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచుతూ జీవో జారీ

- హర్షం వ్యక్తం చేసిన సీఐటీయూ
- టపాసులు కాల్చి, స్వీట్లు పంచుతూ సంబురాలు
- 6,7,8 తేదీల్లో విజయోత్సవ వేడుకలకు పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పోరాటాల ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసినట్టు సీఐటీయూ నాయకులు తెలిపారు. జీవో జారీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం టపాకాలు కాల్చి మిఠాయిలు పంచుతూ సంబురాలు చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం ఎదుట టపాకాలు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ అనేక పోరాటాలు చేపట్టినట్టు తెలిపారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వేతనం రూ. 1000 నుండి రూ.3 వేలకు పెంచిందని అన్నారు. అనేక సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో అప్పులు తెచ్చి వంటలు చేసి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల పోరాటాల ఫలితంగా వేతనాలు పెంచాతమని గతేడాది అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించి అమలు చేయలేదని తెలిపారు. జీవో జారీ కోసం సంవత్సర కాలంగా సీఐటీయూ అనేక పోరాటాలు, వివిధ రూపాల్లో చేపట్టినట్టు గుర్తుచేశారు. సీఐటీయూ చేపట్టిన పోరాటాల ఫలితంగా శనివారం జీవో విడుదల చేసిందని అన్నారు. జీవో విడుదల చేయడాన్ని సీఐటీయూ హర్షిస్తున్నట్టు తెలిపారు. ఈ జీవోను గత సంవత్సరం అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుండి అమలు చేస్తూ ఏరియర్స్‌తో సహ చెల్లించాలని కోరారు. వేతనాల పెంపు జీవో కోసం పోరాటాలు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల అభినందన సభ నిర్వహించారు. అదే విధంగా 6, 7, 8 తేదీలలో మండల కేంద్రాల్లో విజయోత్సవ వేడుకలు జరపాలని జిల్లా కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు చామంతి, లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు జక్కం సుజాత, సాయమ్మ, నిరంజన, గంగాధర్, బాలరాజు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో సీఐటీయూ కార్యాలయం ఎదుట కార్మికుల, నాయకుల నినాదాలు



టపాసులు కాల్చుతూ సంబురాలు చేపట్టిన కార్మికులు, నాయకులు



కామారెడ్డిలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

రేపు మండల కేంద్రాలలో విజయో త్సవ కార్యక్రమాలు

కామారెడ్డి టౌన్ : సీఐటీయూ పోరాటాలతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు వేతనం రూ.వేయి నుంచి మూడు వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల సీఐటీయూ కామారెడ్డి జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 6వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో విజయోత్సవ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు ఇన్సూరెన్స్, పి ఎఫ్ సౌకర్యం కల్పిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

జుక్కల్/మద్నూర్ : సీఐటీయూ పోరాటాల ఫలితంగా మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని సీఐటీయూ జిల్లా నాయకులు సురేశ్‌గొండ తెలిపారు. ఈ నేపథ్యంలో 6వ తేదీనా మండల కేంద్రాల్లో విజయోత్సవ ర్యాలీలు చేపట్టనున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఏజెన్సీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఇన్సురెన్స్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న నాయకులు, పేదలు

అర్హులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్‌గౌడ్
- ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మెమోరాండం అందజేశారు.

ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి పట్టణం లో ఇండ్లు లేని పేదలు వందలాదిమంది ఉన్నారని వారికి కనీసం తల దాచుకోవడం కోసం గుడిసె వేసుకునేందుకు ఇంటి స్థలం లేని పేదలు ఉన్నారని తెలిపారు. పట్టణ పరిధిలో వందల ఎకరాల భూమి ఉందని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ అయినా ఇవ్వాలని లేదా కనీసం గుడిసెలు వేసుకోవడానికి ఇండ్ల స్థలమైన కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలం ఉన్న వారికి డబుల్ బెడ్ రూమ్ కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోతిరాం నాయక్ మాట్లాడుతూ భూమి లేని నిరుపేదలకు మూడెకరాల భూమి ఇవ్వాలని ఎల్లారెడ్డి ఏరియా లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని వాటిని పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, పట్టణ అధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు లక్ష్మణ్, మల్లేష్, పోచవ్వ, మహేందర్, సాయవ్వ, తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జుక్కల్ ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేసినట్టు చైర్మన్ ఉమాకాంత్ తెలిపారు. చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు ఇక్కట్లు పడుతున్నారని, నిరుపేదలను గుర్తించి నోడల్ అధికారి పడంపల్లి ప్రధానోపాధ్యాయులు లాలయ్య చేతుల మీదుగా పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్ సోమావార్, షణ్ముఖ పటేల్, పాండురంగ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గేట్‌పాస్‌తోనే ఇకపై కలెక్టరేట్‌లోకి ఎంట్రీ





నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నూతన కలెక్టరేట్‌లో వెళ్లేందుకు ఇక నుంచి గేట్ పాస్ అందజేయనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు. కార్యాలయం గేట్ వద్ద, గేట్ పాస్ ఓచర్‌ను ఏర్పాటు చేశారు. నూతన కలెక్టరేట్ కార్యాలయంలో 33 శాఖలు ఒకే చోట ఉండడంతో బాధితులు, సందర్శకులు ఎవరు ఏ విషయానికి వస్తున్నారు, ఎందుకు సందర్శిస్తున్నారు, ఇతరులు ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో నూతన కలెక్టరేట్‌లో గేట్‌పాస్ విధానం అమలు చేస్తున్నారు. కార్యాలయాల సముదాయంలోకి వెళ్లేందుకు ముందుగానే సదరు వ్యక్తుల పేరు, ఫోన్ నెంబర్, ఏ శాఖ అధికారిని కలవడానికి వెళ్తున్నారు, వచ్చిన సమయం, వెళ్లే సమయాన్ని ఆ స్లిప్‌లో పొందుపరచనున్నారు. వారి పని ముగిసిన తదనంతరం ఆ శాఖ అధికారి సంతకాన్ని గేట్ పాస్ వద్ద ఇచ్చిన రిసిప్ట్ పైన చేయించుకొని తిరిగి వెళ్లే సమయంలో గేట్ వద్ద ఈ పాస్‌ను తిరిగి తీసుకోనున్నారు.

నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు వితరణ



విద్యార్థులకు బ్యాగులు అందజేత

నవతెలంగాణ-జుక్కల్

పలు సమాజిక సంస్థలు మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు వితరణ చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బస్వంత్ రావ్ పటేల్ తెలిపారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆశ ఫౌండేషన్ 160 నోట్ పుస్తకాలు అందజేసినట్టు తెలిపారు. బ్రింగ్ ఏ స్మైల్ (బాస్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు అందజేసినట్టు వెల్లడించించారు. సహకరించిన రజని (ఎస్ఏ) ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలికి పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని డీకంపల్లి గ్రామంలో ప్రమాదవశత్తు వృద్ధురాలికి నిప్పంటుకుని చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం డికంపల్లి గ్రామానికి చెందిన రంగోజి నాగు బాయి (70) ఈనెల 27వ తేదీన వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. కాలిన గాయాలతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.

ఎట్టకేలకు పట్టుబడ్డ ఎలుగుబంటి

- నాలుగు రోజుల నుంచి ముప్పతిప్పలు

నవతెలంగాణ-భిక్కనూర్

గత నాలుగు రోజుల నుండి గ్రామస్తులకు, ఫారెస్ట్ అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన ఎలుగుబంటి ఎట్టకేలకు పట్టుబడింది. వరంగల్ నుంచి వచ్చిన రెస్క్యూ టీం సహకారంతో ఎలుగుబంటికి గన్‌తో మత్తుమందును షూట్ చేసి పట్టుకున్నారు. భిక్కనూర్ మండల కేంద్రంలో గత నాలుగు రోజుల క్రితం దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ సమీపంలో ఎలుగుబంటి సంచరిస్తున్నట్టు కనిపించింది. దీనిని గమనించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో నాలుగు రోజుల నుండి ఎలుగు బంటిని పట్టుకోవడానికి పగలు రాత్రి తేడా లేకుండా ఫారెస్ట్ అధికారులు తీవ్ర ప్రయత్నం చేశారు. శుక్రవారం రాత్రి ర్యాగట్లపల్లి గ్రామస్తులకు ఎలుగుబంటి కనిపించడంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు శుక్రవారం రాత్రి నుండి శనివారం మధ్యాహ్నం వరకు గ్రామస్తుల సహకారంతో ఎలుగుబంటిని పట్టుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. చివరకు చెట్ల పొదలలో దాగి ఉన్నట్టు గుర్తించిన ఫారెస్ట్ అధికారులు ఎలాగైనా పట్టుకోవాలని రెస్క్యూటీమ్ ను వరంగల్ నుండి పిలిపించారు. ఎలుగుబంటి ఉన్న ప్రదేశానికి చేరుకున్న రెస్క్యూ టిమ్ పొదలచుట్టు వలను ఏర్పాటు చేసి ఎలుగుబంటి బయటకు రాగానే గన్‌తో షూట్ చేసి మత్తుమందు ఎక్కించారు. స్పృహ తప్పి పడిపోయిన ఎలుగుబంటిని బోనులో బంధించి రెస్క్యూటీమ్ తీసుకెళ్లారు. నాలుగు రోజుల నుండి గ్రామస్తులకు ముప్పు తిప్పలు పెట్టిన ఎలుగుబంటి ఎట్టకేలకు ఫారెస్ట్ అధికారులు పట్టుకోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలుగుబంటిని పట్టుకోవడంలో డీఎఫ్ఓ నికిత, ఎఫ్‌డిఓ గోపాలరావు, ఎఫ్ఆర్ వో రమేష్, ఎఫ్ఎస్ఓ అనురంజని, బాబా, బషి ఆలీ, డిఆర్‌ఓ ఫారుక్, పద్మ, బీట్ ఆఫీసర్లు పద్మారావు, సురేష్, దీపిక, సునీత, రాజమణి, పద్మ, శ్రీనివాస్, మాచారెడ్డి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది, భిక్కనూర్ పోలీసులు తీవ్రంగా కృషి చేసినందుకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు.. బోనులో ఎలుగుబంటి బంధి

బోదకాల వ్యాధిని నిర్మూలించేందుకు సహకరించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

బోదకాల వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామ సర్పంచ్ నాగర్తి పోతిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బోదకాల వ్యాధిగ్రస్తులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న నివారణ కిట్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వరనగర్‌లో..

మండలంలోని సిద్ధరామేశ్వర నగర్ గ్రామంలో ఫైలేరియా బాధితులకు కిట్లను సర్పంచ్ జనగామ శ్రీనివాస్ శనివారం అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లా డుతూ బోదకాలు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఐదు రకాల వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సౌజన్య కో ఆప్షన్ సభ్యులు సిద్ధ రాములు, వార్డు సభ్యులు, ఏఎన్ఎం యాదమ్మ ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు కిట్లు అందజేత

మనఊరు మనబడి పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనఊరు మనబడి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కోపరేటివ్ అధికారి, మండల ప్రత్యేక అధికారి సింహాచలం ఆదేశించారు. శనివారం మండలంలోని కొండాపూర్, ముషీర్‌నగర్, గడ్కోల్, తూంపల్లి గ్రామాలలో ఉన్న పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పనుల వేగం పెంచాలని, త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం తూంపల్లి సొసైటీని సందర్శించారు. సొసైటీలో ఎరువుల కొరత లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీప్రసాద్, స్థానిక గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్కూల్‌ను సందర్శించిన అధికారులు

'వచ్చే ఎన్నికలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం'

నవతెలంగాణ-నంది పేట్

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో యూత్ జోడో-బూత్ జోడో కార్యక్రమాన్ని శనివారం నందిపేట మండల కేంద్ర నందిగుడి ఆవరణలో నిర్వహించారు. ఈ యువజన రివ్యూ సమావేశానికి నందిపేట్ మాక్లూర్, డొంకేశ్వర్ మూడు మండలాల యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోపి మాట్లాడుతూ.... రాష్ట్రంలో యువజన కాంగ్రెస్ ప్రతిష్టంగా ఉందని ఆ పటిష్టమైన యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకే యూత్ జోడో బూత్ జోడో కార్యక్రమాన్ని చేపట్టామని, ఈ కార్యక్రమం ద్వారా దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఏ విధంగా తోడ్పడిందో ప్రజలకు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు. జిల్లా నాయకులు మంద మైపాల్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి ప్రజలలో అభిమానం తగ్గలేదని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికై ప్రజలకు విద్యా వైద్య సౌకర్యాలను కల్పించిన పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి, రాష్ట్ర ఇంచార్జ్ రమేష్ బాబు, జాతీయ యువజన కాంగ్రెస్ ఎలక్షన్ మేనేజ్మెంట్ ఇంచార్జ్ అర్పిత్, ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, శ్రీకాంత్, మండల బీసీ సెల్ అధ్యక్షులు వైయస్ గంగాధర్, యువజన కాంగ్రెస్ నాయకులు దమ్మాయి శ్రీను, పవన్, హరీష్ నవీన్, నాగరాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు

అవయవదానంతో నలుగురికి పునర్జన్మ

నవతెలంగాణ-తాడ్వాయి



తాను మృతిచెందుతున్నా.. అవయవదానం చేసి మరో నలుగురికి పునర్జన్మ ఇచ్చిన ఉదాంతం ఇది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఎర్రపహడ్‌కు చెందిన ఉమా శంకర్‌గౌడ్(33) ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ క్రమంలో బ్రెయిన్ డెడ్ కావడంతో కోమలోకి వెళ్లిపోయాడు. దీంతో అవయవదానానికి తండ్రి శంకర్‌గౌడ్ ముందుకు వచ్చారు. శంకర్‌గౌడ్.. కండ్లు, గుండె, కిడ్నీలను మరో నలుగురికి దానం చేసి వారికి పునర్జన్మ ఇచ్చాడని గ్రామస్తులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని సోమూర్ గ్రామానికి చెందిన హెచ్.దశరథ్‌కు అనారోగ్య కారణంగా మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రి ఖర్చులకు ముఖ్యమంత్రి సహనిధికి దరఖాస్తు చేసుకోవడంతో మంజూరైన 60 వేల చెక్కును నాగల్‌గావ్ మాజీ ఎంపిటిసి సరుబాయి శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిల్ కూమార్, మాజీ ఎంపిటిసి సరుబాయి, లబ్దిదారుడు దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నల్లగుట్ట లక్ష్మి నర్సింహా జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని దుబ్బాక గ్రామ శివారులో ఎత్తైన గుట్టపై వెలిసిన నల్ల గుట్ట నర్సింహస్వామికి ప్రతియేటా దుబ్బాక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి మూడు రోజులపాటు జాతర ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటిరోజు గ్రామపంతులు ఇంటినుంచి దేవత మూర్తులను ఊరేగింపుగా పల్లకిలో భక్తి శ్రద్ధలతో భక్తులు కొండపైకి తీసుకెళ్లి గుడిలో ప్రతిష్ఠాపించి, అక్కడే వెలిసిన కోనేటిలో భక్తులు స్నానాలు ఆచరించి, చిన్నపెద్ద పిల్లాపాపలతో కలిసి నరసింహుని మొక్కులు తీర్చుకుంటారు. కాగా నేటి నుంచి జరిగే ఈ ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు పెర్కిట్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ ఉర్దూ మీడియం పాఠశాలలో నేడు చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత సర్జికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మధుశేఖర్ శనివారం తెలిపారు. మైనర్ ఆపరేషన్లు అవసరమైన వారు శనివారం పేర్లు నమోదు చేసుకోవాలని, ఆపరేషన్ కోసం ఎంపికైన వారు ఆదివారం ఏమీ తినకుండా రావాలని, మేఘ హెల్త్ క్యాంపులో స్పెషలిస్టుల ద్వారా ఉచిత వైద్యం కోసం వచ్చేవారు ఉదయమే రావాలని తెలిపారు. క్యాంప్ ఇంచార్జిలుగా ఆశ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సిరి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ లింగారెడ్డి, వసంత జ్యోతి హాస్పిటల్ వైద్యురాలు వసంతకుమారి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

రేషన్ షాపుల నిర్వహణను

పకడ్బందీగా పర్యవేక్షించాలి

- ప్రతి రేషన్ షాపులో బోర్డును, సరుకుల స్టాక్ వివరాలను ప్రదర్శించాలి
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు సబ్సిడీపై నిత్యావసర సరుకులు అందిస్తున్న రేషన్ దుకాణాల నిర్వహణ తీరును పకడ్బందీగా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రేషన్ డీలర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి రేషన్ షాపులో బోర్డును, సరుకుల స్టాక్ వివరాలను ప్రదర్శించాలని, రేషన్ కేటాయింపులు, వాటి పంపిణీకి సంబంధించిన వివరాలను నిర్ణీత నమూనాలో రిజిస్టర్‌లలో నమోదు చేయడం, ఫిర్యాదుల పెట్టే, ఈ-పాస్ మెషీన్ ఆధారంగా సరుకుల పంపిణీ, క్యూలైన్ పద్ధతి తదితర ప్రక్రియలన్నీ పక్కాగా జరిగేలా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో విరివిగా రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో ఏవైనా లోటుపాట్లను, తప్పిదాలను గుర్తిస్తే, తగిన ఆధారాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. అక్రమాలకు పాల్పడే వారిని ఎంతమాత్రం ఉపేక్షించకూడదని, అదే సమయంలో నిజాయితీగా పనిచేసే వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రతీ నెల నిర్ణీత గడువులోగా డీలర్లు రేషన్ సరుకులు దిగుమతి చేసుకుని, సకాలంలో వాటిని ప్రజలకు పంపిణీ చేసేలా పక్కాగా పర్యవేక్షణ చేయాలన్నారు. సన్న బియ్యం, దొడ్డు బియ్యం అనే తేడా చూపకుండా, వచ్చిన నిల్వలను వచ్చిన విధంగా రేషన్ షాపులకు కేటాయించాలని ఎంఎల్ఎస్ పాయింట్ల నిర్వాహకులను ఆదేశించారు. మోడల్ రేషన్ దుకాణాల కోసం అనువుగా ఉన్న రేషన్ షాపుల జాబితా అందించాలని అధికారులకు సూచించారు. కాగా, ధాన్యం సేకరణ ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రేషన్ డీలర్లు గన్నీ బ్యాగులు తిరిగి వాపస్ చేయాలని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్‌కు సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల ఇంచార్జ్‌లు నిర్దేశిత కేటాయింపులకు అనుగుణంగా రేషన్ డీలర్ల వద్ద నుంచి గన్నీ బ్యాగులు వెనక్కి తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు రేషన్ డీలర్లు పూర్తి స్థాయిలో సహకరించాలని అన్నారు. సమీక్షా సమావేశంలో డీ.ఎస్.ఓ చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

జన్నేపల్లి వాగులో పడి ఒకరు మృతి

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

నవతెలంగాణ-నవీపేట్



వెంకటేశ్వర్లు మృతదేహం

పోలీస్‌స్టేషన్ పరిధిలోని జన్నెపల్లి వాగులో పడి వెంకటేశ్వర్లు (42) మృతి చెందినట్టు ఎస్ఐ రాజరెడ్డి శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు బుధవారం ఇంటి నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం వాగులో మృతదేహం ఉందన్న సమాచారంతో భార్య సుజాత వెళ్లి చూడగా మృతదేహం వెంకటేశ్వర్లుగా గుర్తించారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

నవతెలంగాణ-నందిపేట్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. ఎస్ఐ సల్లా శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కౌల్‌పూర్ గ్రామానికి చెందిన బడవత్ భూమన్న (53) శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో తన నివాసం నుంచి నందిపేట్‌కు తన బైక్‌పై వెళుతుండగా విజయనగరం వద్ద ఎదురుగా వస్తున్న నందిపేట గ్రామానికి చెందిన మనోజ్ అనే వ్యక్తి బైక్‌తో ఢీకొనడంతో భూమన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ప్రమాదానికి కారణమైన నందిపేట వ్యక్తి మనోజ్‌పై కేసు నమోదు చేశామని, మృతుడి భార్య రెండు సంవత్సరాల క్రితం కరోనాతో మరణించగా.. మృతునికి ముగ్గురు కుమారులున్నారు.

జిల్లా సాధన కోసం న్యాయవాదుల బైక్ ర్యాలీ

నవతెలంగాణ-బోధన్

బోధన్ ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బోధన్ పట్టణంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. అంతకుముందు రిలే దీక్షలలో న్యాయవాదులు పాల్గొన్నారు. దీక్షా శిబిరం నుంచి న్యాయవాదులు, కుల సంఘాల ప్రతినిధులు, ఆటో యూనియన్, విద్యుత్ శాఖ కార్మికులు, విద్యార్థి జేఏసీ నాయకులు, అంబేద్కర్ చౌరస్తా నుంచి మోటర్ బైక్‌లతో ర్యాలీ చేపట్టారు. బోధన్‌ను జిల్లాగా ఏర్పాటు చేసేవరకూ తమ దీక్షలు కొనసాగిస్తామని న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ నిరసన దీక్షలలో న్యాయవాదులు సి.హెచ్.వి హన్మంత్‌రావు, అడ్లూరి శ్రీనివాస్, బాణోత్ రమేష్, ఎలక్ట్రికల్ సంఘం అధ్యక్షులు కృష్ణ, గంగాధర్, మాధవరావు, గంగారాం, సెంట్రింగ్ కార్మికులు, బిల్డింగ్ పెయింటర్లు, విద్యార్థి జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కబ్జా యత్నాన్ని అడ్డుకోవాలి

- మల్లాపూర్ గ్రామస్తుల వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, కబ్జా యత్నాన్ని అడ్డుకోవాలని కోరుతూ శనివారం ఇందల్‌వాయి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రునకు మల్లాపూర్ సర్పంచ్ లోలం సత్యనారాయణ, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లాపూర్ శివారులో సర్వే నెంబరు 263లోని గుర్య గుట్టలో సుమారు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఆ భూమి కబ్జా కాకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నర్సయ్య, ఆసది రాజన్న, గంగాగౌడ్, సంగు నరాయణ, ఎం.గంగాధర్, రాజేందర్, ప్రవీణ్, గంగాధర్ తదితరులున్నారు.

మోడల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ

మోడల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 31న 10వ తరగతి చదువుతున్న సభావత్ దినేష్ అనే విద్యార్థిని ఇష్టం వచ్చినట్టు కొట్టిందన్నారు. గత 8, 9 సంవత్సరాల నుంచి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన నుంచి అనేక అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ఇకనైనా ఆమెను తొలగించి వేరేవారికి బాధ్యతలు అప్పగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన పీఎంపీ అసోసియేషన్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పీఎంపీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పులగంమోహన్, ఉపాధ్యక్షులు రవివర్మ, కార్యదర్శి శ్రీనివాస్, నిజామాబాద్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వహీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇంతియాజ్ అలీ, సాగర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వంట మనిషికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు వంట మనిషి కావాలని ప్రత్యేక అధికారి స్వప్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడవ తరగతి వరకు చదువుకున్న మహిళ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళ అభ్యర్థులు ఈ నెల ఏడవ తారీఖున సాయంత్రం నాలుగు గంటలలోపు పాఠశాల యందు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

వీఆర్ఏల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని వీఆర్ఏలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసినట్టు వీఆర్ఏల సంఘం మండలాధ్యక్షుడు సాయన్న శనివారం తెలిపారు. పే స్కేల్ గురించి వీఆర్ఏలు అసెంబ్లీని ముట్టడిస్తారన్న అనుమానంతో వీఆర్ఏలను ముందస్తుగా అరెస్టు చేసినట్టు సమాచారం. అరెస్టు అయిన వారిలో అధ్యక్షుడు సాయన్న, ఉపాధ్యక్షుడు గంగాధర్ తదితరులున్నారు.

ఉపాధిహామీపై మోడీ విధానాలు ఎండగడదాం

- అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

ఉపాధి హామీలో బడ్జెట్ పెంచి ప్రతీ కార్మికుడికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో రూ.2,75,000 కోట్ల రూపాయలకు బడ్జెట్‌ను పెంచి, ప్రతి వ్యవసాయ కార్మికుడికి 200ల రోజులు ఉపాధి కల్పించాలని, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీకి బడ్జెట్ తగ్గించడాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో వ్యవసాయ రంగంపై ఆధారపడి నూటికి 70 శాతం ప్రజలు జీవిస్తున్న సంగతి తెలిసిందేనని, వ్యవసాయ కార్మికులు (కూలీలు) ప్రభుత్వ విధానాల మూలంగా, వ్యవసాయంలో విచ్చలవిడి ఎరువుల వాడకం, పెట్టుబడి, అధిక యాంత్రీకరణ వినియోగం వలన, పేదలు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి కోల్పోయి గ్రామీణ ప్రాంతాల్లో జీవించలేని స్థితిలో దేశవ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాల ఫలితంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఈ చట్టం వ్యవసాయ కార్మికులను (కూలీలను) పట్టణాలకు వలసలు పోకుండా నియంత్రించడానికి, గ్రామాల్లోని ఉపాధిని కల్పించే చట్టంగా అమలవుతున్న దానిలో కొన్ని లోపాలు ఉన్నా, గత 17 సంవత్సరాలుగా కూలీలకు కొంతమేరకైనా ఉపాధి దొరుకుతుందని వివరించారు. కానీ ఇటీవల ఉపాధి పనిని బొందపెట్టే కుట్రలో భాగంగా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులను చూస్తే కూలీలకు ఉపాధి లేకుండా చేసి బిక్షగాళ్లుగా తయారయ్యే విధంగా ప్రభుత్వ యోచన ఉన్నట్టు కనబడుతుందన్నారు.

కనీస వేతనాల చట్టం అమలు చేసి, ఉపాధి కల్పించాలని, ప్రతి వ్యవసాయ కార్మికుడికి 200 రోజుల పని దినాలను ప్రభుత్వమే కల్పించా లని ఏఐపీకేఎస్ డిమాండ్ చేస్తుందని అన్నారు. లేనియెడల ఉపాధి కార్మికులంతా కలిసి ప్రభుత్వాలను కూల్చుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.రమేష్, బి.బాబన్న, ఎం.నారాగౌడ్, ఎం.లింబాద్రి, జె.బాల్‌రెడ్డి, బి.కిషోర్, జె.ఎర్రన్న, లక్కం నరేష్, అనీష్, కట్ట రాములు, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ముస్లింలకు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

ప్రస్తుతం కొనసాగుతున్న చివరి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి నిధులు కేటాయించాలని ఆల్ ఇండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో చివరి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా ముస్లిం మైనార్టీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆల్ ఇండియా తంజీమ్ ఎ ఇన్సాఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముస్లింల క్లిష్టమైన సమస్యలు పరిష్కరించలేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత బీసీ కమిషన్ రాములు నాయకత్వంలో ముస్లింల స్థితిగతులపై సర్వేలో యస్సీ, యస్టీ, బీసీల కంటే దారిద్రరేఖలో జీవనం కొనసాగిస్తున్నట్టు ప్రభుత్వమే ప్రకటించిందని, గ్రామీణ ప్రాంతాలలో ముస్లింలు కనీసం భూమిలేని కూలీలుగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. చదువుకున్న యువత డిగ్రీలు పూర్తిచేసి పట్టణాలకు వలస వచ్చి ఉపాధికోసం చిరు వ్యాపారులుగా, వర్కర్లుగా మారుతూ భద్రతలేని జీవనం, సొంత నివాసాలు లేకుండా జీవిస్తున్నారని అన్నారు. ఈ చివరి బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి ముస్లింల మన్ననలు పొందాలని లేని యెడల రానున్న స్థానిక ఎన్నికలలో ఓడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో గౌస్, రఫత్ బేగ్, షబ్బీర్ ఉన్నారు.

నేడు బ్రహ్మంగారి జాతర ఉత్సవాలు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లికి కూతవేటు దూరంలో ఉన్న గుట్టపై శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణం చేశారు. కాగా ఆదివారం బ్రహ్మంగారి జాతర ఉత్సవాలను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఆలయం నిర్మించిన నాటి నుంచి ప్రతి సంవత్సరం ఇక్కడ స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభోపేతంగా ఐదు రోజుల పాటు బ్రహ్మంగారి జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జాతర ఉత్సవాల్లో చివరి రోజున పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి గోవిందమ్మల కళ్యాణోత్సవం, జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున గుట్టపైన బ్రహ్మంగారి జాతర సందర్భంగా వేలాది మందిభక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జాతర రోజున రాత్రి గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయం నుంచి బ్రహ్మంగారి ఆలయం వరకు రథం ఊరేగింపు ఉంటుంది. ఇందుకోసం ఇటీవల గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సుందరంగా నూతన రథన్ని తయారు చేయించారు. గ్రామం నుంచి సుమారు ఒక కిలోమీటరు దూరం ఉండే బ్రహ్మంగారి ఆలయం వరకు భక్తులు స్వయంగా తాళ్ళతో రథం లాగుతారు.

మండల కేంద్రంలోని శ్రీగిరి క్షేత్రం అడుగడుగునా అలయాలతో ఆధ్యాత్మికంగా అలరారుతోంది. బ్రహ్మంగారి గుట్టపై అలయాలతో శ్రీగిరి క్షేత్రంగా మారి భక్తులకు ఆధాత్మిక నెలవుగా మారింది. మూడు దశాబ్దాల క్రితం బ్రహ్మంగారి ఆలయ నిర్మాణంతో ప్రారంభమై మరెన్నో అలయాలు ఈ క్షేత్రంలో వెలిశాయి. గుట్టపైన, దిగువన ఆలయాలతో ఆధ్యాత్మిక వాతావరణంతో విలసిల్లుతోంది.

బ్రిలియంట్, శ్రీ చైతన్య స్కూళ్ల గుర్తింపును రద్దు చెయ్యాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రిలియంట్ హైస్కూల్, శ్రీ చైతన్య స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో బ్రిలియంట్ స్కూల్, శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని మండల ఎడ్యుకేషన్ అధికారి కార్యాలయంలో ఎంఎస్ కోఆర్డినేటర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో 2022-2023 విద్యా సంవత్సరం ముగియకముందే 2023-2024 విద్యాసంవత్సరం సంబంధించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బ్రిలియంట్ స్కూల్ స్పెషల్ డ్రైవ్ అంటూ 4 నెలల ముందు అడ్మిషన్ చేసుకుంటే స్కూల్ ఫీజు తగ్గిస్తామని, అలాగే శ్రీ చైతన్య యాజమాన్యం స్కాలర్ షిప్ టెస్ట్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులు మోసం చేసే రకంగా అడ్డ దారిన అడ్మిషన్ చేసుకుంటున్న తీరు చూస్తుంటే అది ఎదో ప్రొడక్ట్ సేల్ కోసం సంక్రాంతి ఆఫర్, సమ్మర్ ఆఫర్ లాగా విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న విద్యాశాఖ అధికారులు కనీసం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు.

ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏ ప్రయివేటు విద్యాసంస్థ అయిన అడ్మిన్ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర నాయకులు గణేష్, రాజ్ కుమార్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి కేంద్రాల గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

భారతీయ జనతా పార్టీ కమ్మర్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు కట్ట సంజీవ్ అధ్యక్షతన చౌట్‌పల్లిలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 25 వరకు మండలంలోని అన్ని శక్తి కేంద్రాల గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహరెడ్డి హాజరై మాట్లాడారు.

అక్రమంగా అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటారని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఆర్.గౌతమ్‌కుమార్‌ను తెల్లవారుజామున అర్సపల్లిలో అరెస్ట్ చేసి నిజామాబాద్ మూడవ టౌన్‌కు తరలించారని, వారిని విడుదల చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణ బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామన్న నెపంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ, నియంత పాలన కొనసాగిస్తున్నారని, విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రయివేటు యూనివర్సిటీలను కార్పొరేట్ విద్యా సంస్థలు రద్దు చేయాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానం 2020ను రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని, పెరుగుతున్న ధరలకనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలని హాస్టల్ సమస్యలు పెంచాలని, యూనివర్సిటీలకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మన ఊరు మనబడి పాఠశాలల తనిఖీ

నవతెలంగాణ-వర్ని

మండలంలోని మన ఊరు- మన బడికి చెందిన ప్రభుత్వ పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంఈఓ శనివారం తనిఖీ చేశారు. యస్ఆర్ఈజీఎస్‌లో చేపట్టిన పనులను జాలాల్‌పూర్, చింతల్‌పేట్ తండా, శ్రీనగర్ ప్రభుత్వ పాఠశాలలో పనుల నాణ్యతను పరిశీలించారు. ఎంఈఓ శాంతకుమారి, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

ఆనందగిరి లక్ష్మి నృసింహాస్వామి కళ్యాణోత్సవంలో జెడ్పీటీసీ



కళ్యాణోత్సవంలో పాల్గొన్న జెడ్పీటీసీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో ఆనంద్‌గిరి లక్ష్మి నరసింహస్వామి కళ్యాణ కార్యక్రమంలో జడ్పీటీసీ తనుజ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ హరిత పాల్గొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, సర్వదేవతా పూజ, గరుడ పటాదివాసము, గరుడ హెూమం, ధ్వజరోహణం, బలిహారణం మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్వామి వారి కళ్యాణం మ.12 గంటలకు నిర్వహించారు. కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని సావర్‌గావ్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శనివారం అన్నప్రాసన నిర్వహించినట్టు టీచర్ సంధ్య తెలిపారు. సర్పంచ్ కిషన్ పొవర్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమం నిర్వహించి గర్భిణిలకు, బాలింతలకు పౌష్టికాహారంపై వివరించారు. ఆహర నియమాలు పాటించి తాజా కూరగాయలు, పాలు, గుడ్లు, వేడిగా వండిన భోజనం చేయాలని టీచర్ సంధ్య తెలిపారు. కార్యక్రమంలో ఆశా ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రాసన చేయిస్తున్న సర్పంచ్

ఇసుక డంప్ స్వాధీనం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని అయ్యపల్లి గ్రామ సమీపంలోని పంట పొలాల వద్ద ఉన్న ఇసుక డంపును శనివారం స్వాధీనం చేసుకున్నామని రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య తెలిపారు. అయ్యపల్లి గ్రామానికి చెందిన కొందరు పంట పొలం వద్ద 10 ట్రాక్టర్ల ఇసుకను నిల్వ ఉంచారని సమాచారం రావడంతో వెళ్లి పరిశీలించారు. ఎవరిక్కడ డప్పు చేశారని చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఇక్కడినుండి ఇసుకను తరలించినట్లయితే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. అయన వెంట రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



బడ్జెట్‌లో విద్యాశాఖకు అధిక నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నీల నాగరాజు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

ప్రభుత్వ రంగ విద్యను బలోపేతం చేసేందుకు విద్యాశాఖకు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీ సంక్షేమ వసతి గృహాలకి స్వంత భవనాలు ఉండేలా, అధునాతన సదుపాయాలు ఉండేలా బడ్జెట్ లో నిధులు కేటాయించాలని అన్నారు. అలాగే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ కి ఎప్పటికీ మొండి చేయి చూపిస్తున్నారు అని,ఈ బడ్జెట్లో యూనివర్సిటీ ప్రతిపాదనలకి అనుగుణంగా రూ.400 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.సంతోష్, ఎం.నవీన్, కృష్ణ, బాను ప్రసాద్, చరణ్, ప్రతీప్, రాము, బంతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



బోరుడ్రిల్లింగ్ పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని లొంగన్ గ్రామపంచాయతీలోని తండాలో నీటి ఎద్దడి నివారించే చర్యల్లో భాగంగా జీపీ నిధులతో శనివారం బోర్ డ్రిల్లింగ్ పనులు సర్పంచ్ నాగగిద్దె ఉషారాణీ ప్రారంభించినట్టు జేపీఎస్ అనురాధ తెలిపారు. రాబోయేది ఎండకాలం కాబట్టి ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని బోరు బావి తవ్వకం ప్రారంభించినట్టు సర్పంచ్, మండల ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బస్వాపూర్ సర్పంచ్ రవిపటేల్ , లొంగన్ మాజీ సర్పంచ్ విఠల్, బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, సదుపటేల్ , చిన్న ఎడ్గి శివాజీ పటేల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాల గడువు పొడగింపు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల కోసం దరఖాస్తు గడువును ఈనెల 15 వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ వెంకట రాములు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో పూర్తి సీట్లతో పాటు 6, 8 తరగతులలో పరిమిత సంఖ్యలో మిగిలి ఉన్న మైనారిటీ సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లోగానీ, నేరుగా గురుకులానికి వచ్చి ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు గురుకులంలో 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

భర్త చిత్రహింసలు భరించలేక చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-మాక్లూర్



చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని కల్లడి చెరువులో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన గోని శాంత (55) గత కొన్ని రోజులుగా భర్త దయానంద్ పిల్లలు పుట్టడం లేదు నీకెందుకు బతుకు అని చిత్రహింసలు పెట్టడంతో జీవితం పై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. మృతురాలి అన్న కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంటపొలాలు పరిశీలన



కాండం తొలుచు పురుగు నివారణకు మందుల పిచికారిపై అవగాహన

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని గుర్జాల్ గ్రామ పరిధిలోని వరి పొలాలను మండల వ్యవసాయాధికారి నరేష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు మరియు ఉల్లి కోడు ఉన్నట్లు గుర్తించి నివారణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. చలి వాతావరణం వున్నది కావున అగ్గి తెగులు వచ్చే అవకాశం ఉందని, కావున రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలనిచెప్పారు. ఆయన వెంట రైతులు కొండయ్య, సంగయ్య, రాములు,కిషన్ మరియు ఏ ఈ ఓ రాజశేఖర్ తదితరులున్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో నిరంతరం తనిఖీ చేపట్టాలి

- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలోని స్కానింగ్ సెంటర్‌లను ప్రతి నెల జిల్లా స్థాయి వైద్యాధికారులు తనిఖీలు చేయాలని జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి సూచించారు. గ్రామస్థాయిలో పోలీస్, ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించాలని చెప్పారు. కామారెడ్డి కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం గర్భధారణ, గర్భస్థ పిండ ప్రక్రియ నియంత్రణపై జిల్లా స్థాయి అధికారుల సమీక్ష సమావే శం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా న్యాయ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భస్థ పిండ పరీక్ష నియంత్రణపై స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు, ఐఎంఏ, రెడ్ క్రాస్ ప్రతినిధులకు, జిల్లా అధికారు లకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు వైద్య శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయవాది శ్రీదేవి

అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 28 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. అన్ని స్కానింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఉండేవిధంగా చూడాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు తెలియజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ అన్యోన్య, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్, వైద్యురాలు శిరీష, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, అధికారులు వేణుగోపాల్, చలపతి పాల్గొన్నారు.

సకాలంలో కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కళ్యాణ లక్ష్మి పథకం ఆడపిల్లలకు వరమని ఎంపీపీ శారదా నాగరాజు అన్నారు. దోమకొం డలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు ఒక లక్ష 116 రూపాయల చొప్పున విలువగల రూపాయల చెక్కుల ను మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా నాగరాజు మాట్లాడుతు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి పదకం ఆడబిడ్డల కుటుంబీకులకు ప్రయోజన కరంగా మారిందన్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చొరవతో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు సకాలంలో మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు తీగల తిరుమల్ గౌడ్, ఇంచార్జ్ తాసిల్దార్ కౌశిక్ రెడ్డి, ఎంపీడీవో చిన్నారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్, సర్పంచులు నల్లపు అంజలి శ్రీనివాస్, సలీం, సూర్య ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎం జీవన జ్యోతి బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేత

నవతెలంగాణ-జుక్కల్

ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన చెక్కును జుక్కల్ మండలం లాడేగాం గ్రామ లబ్దిదారునికి సొసైటీ చైర్మన్ నాగలగిద్దె శివానంద్ చేతుల మీదగా అందజేసినట్టు జుక్కల్ ఐకేపీ ఏపీఎమ్ సత్యనారాయణ తెలిపారు. శనివారం లాడేగాం స్థానిక సర్పంచ్ అశ్విని రాజశేఖర్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఐకేపీ ఏపీఎం సత్యనారాయణ మాట్లాడుతు లాడేగాం గ్రామానికి చెందిన బోజే అర్చన భర్త జ్ఞానేశ్వర్ సంఘంలో ఉన్నారు. రూ.436 లోను తీసుకున్నప్పుడు ప్రీమియం చెల్లించారు. అర్చన అనుకోకుండా సహజ మరణం పొందారు. బీమా కట్టడం వలన భర్త జ్ఞానేశ్వర్‌కు వచ్చిన రూపాయలు రెండు లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్ సాయులు, ఫీల్డ్ అసిస్టెంట్ కిషోర్, విండో కార్యదర్శి బాబురావ్, ఏపీఎం సత్యనారాయణ, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సమయం వృథా చేయొద్దు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ సలాం మాట్లాడుతూ సమయం వృథా చేయవద్దని అన్నారు. 100కు 99 మార్కులు సాధించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎంసెట్, నీట్ పరీక్షలకు ప్రభుత్వం ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు 50 సీట్లు బాలురకు 50 సీట్లు ఉన్నట్లు తెలిపారు. బోజనం హస్టల్ సౌకర్యం ఉందని అన్నారు. ప్రభుత్వం టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో మండల విద్యాదికారీ యోసఫ్, ప్రిన్సిపాల్‌లు అజ్మల్ ఖాన్. మోహన్ రెడ్డి, అద్యాపకులం కిరణ్, మల్లయ్య, రాజేంధర్, రమేష్, చంద్రశేఖర్, అనంత, సుదాకర్ చందు, ఇష్రత్, లక్ష్మీ, హసీనా, శ్రీ రాం గంగా రాం రాజ్ కుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కన్నాపూర్ లో శనివారం సీసీ రోడ్డు పనులను ఎంపీపీ దశరథ్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద గ్రామానికి రూ, 15 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే సురేందర్ సహకారంతో ప్రారంభించామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్రావు, స్థానిక సర్పంచ్ రాజనర్సు, ఉప సర్పంచ్ అంజిల్ రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రవీందర్ గౌడ్, కసర్ల రాజేందర్, పంచాయతీ పాలక వర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి లావణ్య, ఏఈఓ ' ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

పోడు సాగు భూములకు పట్టాలివ్వాలి

- 20న మహాధర్నాను విజయవంతం చేయండి : ఏఐకేఎంఎస్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

30, 40 యేండ్లుగా దళిత, గిరిజన, ఆదివాసులు సాగుచేసుకుంటున్న పొడు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్), దళిత, గిరిజన, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న చలో హైదరాబాద్ ఇందిరపార్క్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఎన్ఆర్ భవన్‌లో ఏఐకెఎంఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు నాయక్ వాడి నర్సయ్యతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. అడవులను అటవీ సంపదను భూములను కార్పొరేట్లకు ప్రధాని మోడీ ఆశ్రీత పెట్టుబడి దారులైన అదాని, అంబని లకు కట్టబెట్టేలా ఉన్న అటవీ సంరక్షణ నియమావలి-2022 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాపితంగా ఈనెల 6,7 న మండలాల ముందు ధర్నాలు, 13 న జిల్లా కేంద్రంలో, 20 న రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని ఇందిర పార్కులో మహాధర్నా కార్యక్రమలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో నాయకవాడి నర్సయ్య, అగ్గు చిన్నయ, శ్రీనివాస్‌రెడ్డి, దేవస్వామి, బి.సాయిలు, గంగాధర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

చట్టాల అమలుపై పోలీసులకు అవగాహన



పోలీసులతో సమావేశమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరయ్య

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

చట్టాల అమలు పై న్యాయ శాఖ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరయ్య ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కోర్టులో పోలీస్ అధికారులతో శనివారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. నూతన చట్టాలను విశదీకరించారు. క్రిమినల్ చట్టాలు, కోర్టులో కొనసాగుతున్న కేసులకు సంబంధించి సాక్షులు, ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్‌లు కోర్టులో ఏ విధంగా ప్రవేశ పెట్టాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్ నాగిరెడ్డిపేట్ ఎస్సై శంకర, లింగంపేట్, ఎస్ఐ ఆంజనేయులు, గాంధారి ఎస్సై శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న గౌడకులస్తులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు శనివారం గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలగోని రాజ గౌడ్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆయన చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కోదూరి సాయ గౌడ్, పాఠశాల కమిటీ అధ్యక్షుడు రమేష్ గౌడ్, గ్రామ గౌడ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

కంటి వెలుగు ఏర్పాట్లు పరిశీలన



కంటివెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని పిట్లం గ్రామపంచాయతీలో 6 నుండి చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిట్లం మేజర్ గ్రామపంచాయతీ కావడంతో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత భవిత సెంటర్లో 47 రోజులపాటు నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాటలో ముఖ్యంగా తాగునీరు, మూత్రశాలలు, టాయిలెట్స్ , టెంటు సౌకర్యము కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, పంచాయతీ సెక్రెటరీ యాదగిరి పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం పెట్టాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ట్యాంక్ బండ్‌పై మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ మఖ్దూం మొహియుద్దీన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. నైజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి పిలుపునిచ్చిన దాంట్లో మొదటి వ్యక్తి కామ్రేడ్. మగ్దుమ్ మహియూద్దీన్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు రఫిక్ ఖాన్, రఘురాం, ప్రకాష్ పాల్గొన్నారు.

ఖిల్లా రామాలయంలో వైభవంగా గరుడసేవ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని అతి పురాతనమైన ఖిల్లా రామాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయాన్ని తమిళనాడులోని శ్రీవిల్లుపుత్తూరు జీయర్‌స్వామి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీసీతారామచంద్రస్వామి గరుడోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. అంతకుముందు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఖిల్లారామాలయ చైర్మన్ పొద్దుటూరి మహేందర్‌రెడ్డి, సర్పంచి గడ్డం రథకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ ఆసది రవీందర్, ఎంపీటీసీ కోత్తురు మానససాయి, విండో చైర్మెన్ గజవాడ జైపాల్, వీడీసీ సభ్యులు బూస నర్సయ్య, గట్టవలి సాగర్, ఆర్చకులు సుమిత్ శర్మ దేశ్పాండే తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-బోధన్

అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, సొంత స్థలం ఉన్న వారికి ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బోధన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరప్ప మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గత అనేక సంవత్సరాలుగా ఇంటి స్థలాలు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వటం లేదని, కావున అర్హులైన వారికి ఇండ్లస్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఇండ్ల స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం 5లక్షల రూపాయలు మంజూరి చేయాలన్నారు. అలాగే కేంద్రం 3లక్షల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రేషన్ కార్డులు లేని వారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, రైతుల పాస్‌బుక్‌ల సమస్యలు పరిష్కరించి, కొత్త పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అలాగే ఫిబ్రవరి 9న చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర్, ఉపాధ్యక్షురాలు తిరునగరి శశికళ, జిల్లా సహాయ కార్యదర్శి రాజేశ్వరి, జిల్లా నాయకులు కుప్రియాల బాలయ్య, దండు సాయిలు, తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నీరడి గంగామణి, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షులు గైని రాములు, ఎల్లయ్య, షేక్ అజీమ్, చిందుల సాయిలు, జయరాం, అంబం సావిత్రి, గైని అనిత పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న నాయకులు

సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని యాధావిధిగా ఏర్పాటు చేయాలి

- గౌడ కులస్తుల నిరసన దీక్ష



నిరసన దీక్షలో పాల్గొన్న గౌడ కులస్తులు

నవతెలంగాణ-మోర్తాడ్

సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని తొలగించిన స్థానంలోనే యాధావిధిగా ఏర్పాటు చేయాలని గౌడ కులస్తులు డిమాండ్ చేశారు. గత వారం రోజుల క్రితం గౌడ కులస్తులు ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఓ వర్గానికి చెందిన వ్యక్తులు తొలగించడం పట్ల గౌడ కులస్తులు నిరసన తెలిపారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో శనివారం నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓ పక్క ప్రభుత్వమే ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సమయంలో మోర్తాడ్ గ్రామంలో విగ్రహాన్ని గౌడ కులస్తులు ఏర్పాటు చేయడాన్ని ఓ వర్గానికి చెందిన వ్యక్తులు వ్యతిరేకించడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. విగ్రహాన్ని తొలగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విగ్రహ తొలగింపునకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

సఫాయి కార్మికులకు వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలి

- ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాస్

నవతెలంగాణ-ఆర్మూర్

సఫాయి కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాసు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆర్మూర్ ఆలూరు మండలంలోని పలు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి పిప్రి గ్రామపంచాయతీ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ.. సఫాయి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు కూడా పాల్గొంటున్నారని, మహాసభలను హెచ్ఆర్ఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు గొర్రెపాటి మాధవరావు ప్రారంభిస్తారని, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు పద్మ, సత్యమ్మ, ఎల్లమ్మ, చిట్టిబాబు, భూలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు నాందేడ్‌లో నిర్వహించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్టణ, మండల అధ్యక్షులు, మండలాల్లోని సొసైటీల చైర్మన్లు, పండిత్ వినీత పవన్, పూజ నరేందర్, ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి, సోమ హేమంత్ రెడ్డి, కళ్లెం భోజ రెడ్డి, బంటు మహిపాల్, పెంట భోజరెడ్డి అన్నారు. శనివారం ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు నాందేడ్ బయలుదేరారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని దేశంలోనే బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తెలంగాణ సంక్షేమ పథకాలు అందరికీ అమలు అవుతాయని అన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మేయర్ ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న మేయర్ దంపతులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా నిజామాబాద్ పురపాలక శాఖ నగర మేయర్ దండు నీతు కిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె ఆలయంలోని స్వామివారికి కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని జానకంపేట్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు నగర మేయర్ దండు నీతూ కిరణ్ కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు ఘనంగా సత్కరించారు. ఆమె వెంట ఆలయ కమిటీ అధ్యక్షులు పురం సాయిలు, ఏవో వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు, ఆలయ ధర్మకర్త చిలుక నర్సయ్య, ఆలయ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, ఆలయ సిబ్బంది తదితరులున్నారు.

ఉమ్మడి జిల్లాల డిగ్రీ కళాశాలల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ ప్రయివేట్ డిగ్రీ, కాలేజ్‌మెనేజ్‌మెంట్ అసోసియేషన్ (టుమ) ఎన్నికలు డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. పూర్వ కమిటీ సభ్యులు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యజమానులు పాల్గొని 2023-25 సంవత్సరానికి గానూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎస్‌వీ డిగ్రీ కాలేజ్ కరస్పాండెట్ అంభోజీ హరిప్రసాద్ ఎన్నిక కాగా, సెక్రెటరీగా విజేత డిగ్రీ కాలేజీ సంజీవ్ సీతారం, కోశాధికారిగా ఎస్ఆర్‌కే డిగ్రీ కాలేజ్ ఎ.దాత్తద్రి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్ఎస్ఎల్ డిగ్రీ కాలేజ్ వి.శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని ప్రయివేట్ మేనేజ్‌మెంట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం అధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్నికలకు కేర్ డిగ్రీ కాలేజీ యజమాని నరాల సుధాకర్, సాందీపని డిగ్రీ కాలేజ్ హరిష్మన్‌రెడ్డి, నిమ్స్ డిగ్రీ కాలేడీ బి.శ్రీనివాస్ రాజు, సాయిశ్రీ డిగ్రీ కాలేజీ మల్లికార్జున్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కొత్త కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎడపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత తెలుగు ఆంగ్లమాధ్యమం ఉన్నత పాఠశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎడపల్లి వైద్య సిబ్బందిచే క్యాన్సర్‌పై అవగాహన సమావేశం నిర్వహించగా.. వైద్య సిబ్బంది సుమలత విద్యార్థులకు క్యాన్సర్ రావడానికి కారణాలైన పొగాకు, గుట్కా, ఆల్కహాల్ లాంటి వాటిని వినియోగించడం వల్ల వస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలని సూచించారు. ఇంట్లో తండ్రులు, సోదరులు మత్తు పదార్థాలకు అలవాటు పడితే వాటిని మాన్పించే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. మంచి ఆరోగ్యాన్ని పాడుచేసే మత్తు, మాదక పదార్థాలను తీసుకోవడం మానివేయాలని, పోషకాహారం, పండ్లు పౌష్టికాహారం, రోజు తీసుకోవాలని, వ్యాయామం, మెడిటేషన్, యోగా ప్రతిరోజు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, పాఠశాల బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికులకు

వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

- తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేటు ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ)
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేటు ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్, ఆటో డ్రైవర్స్ జిల్లా అధ్యక్షులు కటారి రాములు మాట్లాడుతూ.. రవాణా రంగంపై ఆధారపడి వేలాది మంది కార్మికులు చదువుకున్న యువత పనిచేస్తున్నారని, స్వయం ఉపాధికి కేంద్రంగా ఉన్న రవాణా రంగంలోని కార్మికులను విస్మరించడం సరి కాదని అన్నారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, అందుకు ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల జీవో ఎంఎస్ నంబర్ 25ను గెజిట్‌గా మార్చి ప్రయివేటు స్కూల్ బస్ డ్రైవర్లకు, ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు 10 లక్షల ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని, డ్రైవర్లందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు సాధన కోసం ఈనెల 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు ముజీబ్, జమీల్, షేక్ మునీర్, ఇమ్రాన్, సయ్యద్ అజ్జు, అశ్వక్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ప్రజలను నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తుల అభివృద్ధి బడ్జెట్ అని.. పేద, మధ్య తరగతులను నిరాశపరిచిందని.. బడ్జెట్‌ను వ్యతిరేకించాలని ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ప్రభాకర్, నాయకులు దేవారాం అన్నారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని కుమార్ నారాయణ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సప్త ఋషి బడ్జెట్‌గా గొప్పగా ప్రచారం చేస్తున్న కేంద్రం పేద ప్రజలకు ఒరుగపెట్టిందేమీలేదని అన్నారు. విద్యా రంగానికి అనేక కమిషన్ సిఫారసులు సైతం పెడచెవిన పెట్టి కేటాయింపుల్లో నామమాత్రంగా ప్రకటించారని వివరించారు. కరోనా మహమ్మారి ముప్పేట దాడితో వైద్యరంగం ప్రాముఖ్యతను ప్రపంచం గుర్తించిందని పేర్కొన్నారు. ప్రజలంతా వైద్యంపై శ్రద్ధ చూపాలని డిమాండ్ చేస్తూ వచ్చినా బడ్జెట్ కేటాయింపుల్లో ఒక్క అడుగు ముందుకు వేయకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. కేటాయింపులను పరిశీలిస్తే మోడీ షా మాటలకు చేతలకు పొంతన ఉండదని గుర్తు చేశారు. వ్యవసాయ రంగం, రైతుకు రెండింతల ఆదాయం తెచ్చి పెడతామని గగ్గోలు పెట్టే వీరు ఈ బడ్జెట్లో ఎరువులపై సబ్సిడీ 50 వేల కోట్లకు తగ్గించడం వీరి ద్వంద నీతికి అద్దం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన కోట్లాదిమంది వ్యవసాయ కూలీలకు ఉపాధి చూపించే ఉపాధి హామీ చట్టానికి గత సంవత్సరం కన్నా 29 వేల కోట్ల రూపాయలు తగ్గించి కేటాయింపులు చేయడం వీరి వర్గ సుభానానికి తేటతెల్లం చేస్తుందని అన్నారు. సమావేశంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు యు.రాజన్న, ఆకుల గంగారం, ఐఎఫ్‌టీయూ నాయకులు అరవింద్, పీడీఎస్‌యూ నాయకులు అనిల్‌కుమార్, దుర్గ ప్రసాద్, శేఖర్, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్, దేవరాం

చట్టాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్/ఆర్మూర్

రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయంతి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నరసయ్య ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ నిజామాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో నిజామాబాద్ కోర్టులోని జిల్లా న్యాయసేవా సదన్ హాల్‌లో చట్టాల వన్ వీరు గురించి శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భూకపు రాజేష్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చార్జీషీట్‌లో జరుగుతున్న లోపాలు, విషదీ కరించారు. ఎండీ రహీం ప్రాసిక్యూటర్ వివిధ క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. ముద్దా యిలకు శిక్ష పడేటట్టు చూడాలని అధ్యక్షత వహించిన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనరసయ్య తెలిపారు. సమావేశంలో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్‌తో పాటు నిజామాబాద్ డివి జన్ పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై సమీక్ష..

బోధన్ : బోధన్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమయ్య పోలీసు అధికారులతో నేరాల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ హైదరాబాద్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ శ్రీలక్ష్మీ నరసయ్య ఆదేశాల మేరకు సమీక్ష సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిద్రాల రాణి, ఏసీపీ కిరణ్ కుమార్ బాలల చట్టాలపై అవగాహన, క్రిమినల్ ప్రొసీజర్, సాక్ష్యము సేకరణకు సమీక్ష చేపట్టారు. రుద్రూర్ సీఐ జానారెడ్డి, బోధన్ రూరల్ సీఐ శ్రీనివాసరాజు, ఎస్ఐ అనిల్‌రెడ్డి, నవీన్, సందీప్ రవీందర్, ఏఎస్ఐ రాజు పాల్గొన్నారు.



ఆర్మూర్ : అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నూతన చట్టాలపై అవగాహన..

ఆర్మూర్ : పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.కె.నరేందర్ కార్యాలయంలో నూతన చట్టాలపై అవగాహన, ముద్దాయిలకు కేసులలో శిక్షలు పడటానికి తీసుకోవలసిన చర్యలు తదితర వాటిపై పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆన్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నరసయ్య ఆదేశాల మేరకు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆవారి రమేష్, వివిధ పోలీస్‌స్టేషన్‌ల ఎస్ఐలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని పిప్రి, పల్లికొండ, లింగాపూర్ గ్రామాల్లో లబ్దిదారులకు జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సరిత స్వామి చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. పిప్రి గ్రామానికి చెందిన ఇజాజ్ సుల్తానాకు రూ.70వేలు, మహేష్‌కు రూ.75వేల చెక్కులను గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సర్పంచ్ ప్రవీణ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ బీఆర్ఎస్ నాయకులు తాంస రవీందర్, అరిగెల జనార్దన్, బీమర్తి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన నలంద విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి నలంద ఐఐటీ హైస్కూల్ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించినట్టు పాఠశాల యాజమాన్యం లక్కారం రాజేంద్రప్రసాద్, సాగర్ శనివారం తెలిపారు. ఈ అభ్యాస్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జనవరి 10న నిర్వహించిన ఇంగ్లీష్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఎగ్జామినేషన్లో రాష్ట్రస్థాయిలో మూడవ తరగతి చదువుతున్న కే అభినయ్, రెండవ ర్యాంకు, నాలుగవ తరగతి చదువుతున్న, వెంకటలక్ష్మీ, ఐదవ తరగతి చదువుతున్న పి.నితీషా రెండవ ర్యాంకులు సాధించినట్టు వారు తెలిపారు. మిగతా విద్యార్థులు టాప్ 20లోపు ర్యాంకులు సాధించారు. వారందరినీ నలంద మేనేజ్‌మెంట్, ఐఐటీ, ఒలంపియాడ్ ఇంచార్జుల సమక్షంలో సర్టిఫికెట్, మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో నలంద మేనేజ్‌మెంట్ మాట్లాడుతూ.. ర్యాంకులు సరైన విద్యార్థులనుద్దేశిస్తూ మిగతావారు ప్రతి ఒక్కరూ గణితం, సైన్స్‌పైన శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ ఇంచార్జీ హనుమాన్లు స్రవంతి, ఒలంపియాడ్ ఇంచార్జీ కవిత, మీనాక్షి ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

44వ సీనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ నెల 5 నుంచి 9 వరకు ఒడిస్సా రాష్ట్రం పూరిలో జరగనున్న 44వ సీనియర్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికై బయలు దేరినట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా నుంచి ఎక్కువమంది క్రీడాకారులు రాష్ట్ర జట్టులో ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ జాతీయ పోటీలలో రాష్ట్ర జట్టుకు పతకం తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరజరెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత, పీఈటీ నల్లూరి లత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్‌లు ఈ నరేష్, వేముల మౌనిక పాల్గొన్నారు.

నేడు ముజేగ మల్లన్న జాతర



తయారు చేసిన బంతిపూల తొట్లీలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి యానంగుట్ట వద్ద గల ముజేగ మల్లన్న స్వామి జాతరను ఆదివారం నిర్వహిస్తున్నట్టు స్థానిక కౌన్సిలర్లు ఆకుల రాము, కవిత కాశీరాం, మేడిదాల సంగీత రవిగౌడ్, వీడీసీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్, నారాయణపేట్, లక్ష్మాపూర్, బ్రాహ్మణపల్లి, తొర్లీకొండ, గాంధీనగర్, మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం ఈ జాతరలో పాల్గొంటారని వారు తెలిపారు. గత 30 సంవత్సరాల నుంచి విశ్వబ్రాహ్మణ వడ్రంగి మహిళలు రథానికి కట్టే అతిపెద్ద బంతిపూల తొట్లీలు తయారు చేయడం ఆనవాయితీగా వస్తుంది. కాగా శనివారం సాయంత్రం డప్పు వాయిద్యాలతో తొట్లేలను ఊరేగింపుగా తీసుకొని రథానికి కట్టి జాతర సంబరాలు మొదలు పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు సైతం చేయనున్నారు.

ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు కృషి చేయాలి

- ఎస్ఐ శివరాం

నవతెలంగాణ-ఆర్మూర్

టీఎస్ ఆర్‌టీసీ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా కృషి చేయాలని ఎస్ఐ శివరాం అన్నారు. శనివారం ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అద్దె బస్సు డ్రైవర్లకు మర్యాద, సురక్షితమైన డ్రైవింగ్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువకులు ఉన్నారని అద్దె బస్ డ్రైవర్లు చాలా జాగ్రత్తగా బస్సు నడపాలని వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద తప్పకుండా నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఆర్టీసీలో హెయిర్ బస్ నడుపుతున్న యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లను ఎస్ఐ, ఏఎస్ఐ, డిపో మేనేజర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చిన్నయ్య, డిపో మేనేజర్ కె.కవిత, ఆఫీస్ సూపరింటెండెంట్ పృథ్వీరాజ్, ఎస్ డిఐ అహ్మద్, సేఫ్టీ వార్డెన్ ఎస్‌వీ రెడ్డి, డ్రైవర్లు సునీల్ కిరణ్, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాల కళాశాలకు దరఖాస్తులు చేసుకోవాలి

- ఆర్ఎల్‌సీ అబ్దుల్ బషీర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

5వ తరగతి నుంచి ఇంటర్ వరకు మైనార్టీ గురుకుల పాఠశాల కళాశాలలో గల ఖాళీల భర్తీ కోసం ముస్లిం మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లాల ఆర్ఎల్‌సీ అబ్దుల్ బషీర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఘన్‌పూర్ శివారులో ఉన్న మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల కళాశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గత మూడు రోజుల క్రితం మండలంలోని బర్దిపుర్ గ్రామ శివారులో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య గొడవల్లో ఒక విద్యార్థి సోఫియన్ మృతిచెందిన దృష్ట్యా ముందస్తుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలో ఉన్న తరగతి గదులను, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించి అధ్యాపకులను, విద్యార్థులను కలిసి స్థితిగతులను అడిగి తెలుసుకుని పలు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అర్షి ఇక్బాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.